యెందుకు? పచ్చగా, పచ్చగా వుంటుందే. నీ చెలికత్తె చంపకం - దానిచేత చేయిస్తామిది. సరిగ్గా రేపు తాళిగట్టేముందు మేలిముసుగుతో నిన్ను కల్యాణ మంటపంలోనికి తీసుకునివచ్చి, అలాగనే మాంగళసూత్రం గట్టిస్తాము. నీవు నీ పుష్పద్యానంలోనికి మాత్రం పోకు. అన్నట్టు యీలోపున నీకు క్రొత్తవా రెవ్వరగుపడినా నీవు నీచెలికత్తె చంపకానివనేచెప్పు, తెలిసినదా?

శైవ: తెలిసిందండి, నాన్నగారూ - పురాణాల్లో యెందరో బాలికలిలాగ జేసే వున్నారు.

రాజు: అవునవును. ఇక నీవు లోనికిబొమ్మ ఏమింకా నిలిచి వున్నావు? ఏదైనా చెప్పవలసిన దున్నదా?

శైవ: అవునండి, నాన్నగారూ.

రాజు: (విసుగుతో) ఆలస్యము చేయక త్వరగా చెప్పుము.

శైవ: చంపకానికొక బుల్లిబావవున్నాడు. అంటే చకోరాక్షి కొడుకు. దానికి అతనంటే పంచప్రాణాలూయెగిరి అతనిమీద వ్రాలుతాయి. ఎప్పుడూ అతనిమాట! అతను లేకపోతే బ్రతకలేనని యెన్నిమార్లో చెప్పిందినాతో. కాని, పాపం అతనికింకా యేదీ ఉద్యోగం లేదుట. 'కోటలో పుట్టినదానివి; రాజపుత్రిక చెలికత్తెవు, నీకా ఉద్యోగం సద్యోగం లేనివాడితో పెళ్ళి; వీల్లే'దని వాళ్ళమ్మ ఒప్పుకోవడం లేదుట. మన గ్రద్ద ముక్కు - అంటే - మన చిన్న సేనానితో - చంపకం వెళ్ళి చెప్పుకుంటే, 'ఈ మాటెవడైనా సిపాయీ చచ్చిపోతే వాడికొలువిచ్చి, సేనలో జేర్చుకుంటాము; బెంగ పెట్టుకోవద్ద'ని ధైర్యం చెప్పారుట. అది యెప్పటికో! కనుక, మీరే అతనికో ఉద్యోగమిప్పించి, అతిముఖ్యమైనదీ, అది అంతగా కోరేదీ అయిన పెళ్ళి చేయించాలి.

రాజు: (దుఃఖాన్ని కోపాన్ని ఆపుకుంటూ) నీకు పుణ్యముంటుంది గాని, యిప్పుడు నన్ను విడిచి లోనికి పద. ఊరందరి బాధలూ నీకే కావాలి. అవన్నీ యిప్పుడే తీర్చాలి! చంపకం మాకార్యం సఫలమయ్యేలాగ జేస్తే, వాడికి మంచి వుద్యోగ మిప్పించి, దాన్ని వాళ్ళ బుల్లిబావకిచ్చి వెంటనే పెళ్ళి జేయిస్తాము. ఇకసరేనా? త్వరగా మేమును లోనికిబోయి, మీ మాతాజీగారితోనూ చంపకంతోనూ అన్నీ చెప్పియేర్పాట్లు చేయించాలి.

శైవ: ఇది విని అదెంత సంతోష పడి పోతుందో! (లోనికి బోవును.)

రాజు: (నిస్పృహతో) ఎంత అడివిపిల్ల!... ఆ మగని దగ్గిరెలా మసలు కుంటుందో! అతడెలా అఘోరిస్తాడో!... మగనిని లేవాలన్న బాధరాదిగాని, అవంతాగూడా నాకెందుకు? అది వాళ్ళఖర్మ! (ముగింపు వచ్చే సంచికలో)

# గురువింద గింజలు

"హితశ్రీ"

ఆఫీసు నుంచి తిరిగి వొచ్చి అప్పుడే ఇంట్లోకి ప్రవేశిస్తున్న గోపాలరావు పక్కభాగం లోంచి వినపడుతున్న నిర్విరామ కుపితస్వరాలని ఒక్క క్షణం కనుబొమల ముడిపాటుతో ఆకళించి 'సంగతేమి'టన్నట్టు రాధవైపు చూశాడు. రాధ అవహేళనగా నవ్వింది.

'ఫలానావాళ్ళ అమ్మాయికి పద్దెనిమిదో ఏడని జానకమ్మగారంటే, కాదు పదిహేడే నని పార్వతమ్మగారంది. దాంతో ఇద్దరికీ లడాయిపడ్డది.'

'ఇంత అజ్ఞానపు మనుష్యులేం?' అని గోపాలరావు ఆశ్చర్యపడసాగాడు. రాధ ఏదో అనబోయింది. గాని పక్కభాగంలోని ఉరుముల శబ్దం ద్విగుణీకృతం కావటంవల్ల ఆ ప్రయత్నం విరమించుకుని గోపాలరావువైపు సాభిప్రాయంగా చూసి మందస్మితవదన ఐంది.

'పడకపోతే పడనట్టుండాలి గాని దానికి పద్దెనిమిదేళ్ళనీ, పంధొమ్మిదనీ కల్పించటం మంచిదికాదు జానకమ్మా!' అంది పార్వతమ్మ కోపంతో.

'ఉన్నమాటంటే నీకంత ఉలుకెందుకు? ఏళ్ళు ఉన్నాయి గనక ఉన్నాయన్నాను గాని ఈ లౌక్యాలు నాకేం తెలుసు?'

'కిందటి గోదావరి పుష్కరాలకి అది పుట్టనే పుట్టకపోయె. దానికి పద్దెనిమి దేళ్లంటే నమ్మొద్దూ? నువ్వనగానే సరా?'

'అబద్ధాలు చెప్పటానికి నాకేం పట్టింది? కావాలిస్తే మునిసిపాలిటీలో కనుక్కో, తెలుస్తుంది. తెలియకపోతే, తెలియనట్టుండాలిగాని'

'అంతదాకా ఎందుకు? మీ రెండో అమ్మాయికీ దానికీ సంవత్సరమేగా తేడా? మీ అమ్మాయి పుట్టిన సంవత్సర మేమిటో చెప్పు, తేల్తుంది.'

'మా అమ్మాయి సంగతి నీకెందుకు?'

'మరి ఊళ్లో వాళ్ల సంగతి నీకెందుకు?'

'అసలు ఈ గొడవ ఎత్తింది నువ్వా నేనా?'

'అబద్ధాలు చెబుతూంటే చూస్తూ ఎవరూరుకో గలరు? అనవసరంగా దాన్నంటే అది నీకే తగులుతుందని ఆమాత్రం తెలుసుకోలేవూ?'

'అబ్బో, జీతం బత్తెం లేని వకాల్తా తీసుకుని జమాయించి పోట్లాడగలవులే. ఇహ దయ చెయ్యి.'

'ఇంతకీ మీ అమ్మాయి......'

'దాని సంగతెత్తితే నీ పరువు నిలవదు. తగుదునమ్మా అని...'

'అబ్బో మహా పరువుగలదానివి...'

జానకమ్మకి ఉక్రోషం వచ్చింది. ఆమె ముఖం అంతా ఎర్రబడ్డది.

నా పరువుకేం తక్కువొచ్చింది? చెప్పుతీసుకునేవాళ్లు లేక! నీవంశం, నీ మర్యాద, నీ గొప్ప తనమే చెప్పొచ్చావు.

జానకమ్మ అనర్గళంగా పార్వతమ్మ పుట్టింటి వారిని, మెట్టినింటి వారిని ఏడుతరాలదాకా విమర్శించింది. పార్వతమ్మ తీసిపోయింది కాదు గనక జానకమ్మ వశంలో పుట్టబోయే ఏడు తరాల వాళ్లు ఎలా ప్రవర్తిస్తారో జోస్యంకూడా చెప్పింది తడుముకోకుండా.

ఇదంతా వింటున్న గోపాలరావు 'మనుష్యులకి ఇంత సంకుచిత దృష్టి ఎలా అలవడు తుందో' అని ఆశ్చర్యపోయాడు.

'ఊళ్లో ఎవరో అమ్మాయిని గురించి వీళ్లకింత తర్జన భర్జన ఎందుకు' అంది రాధ వాళ్ళ అమాయకత్వానికి జాలిపడుతూ.

'అయినా ఈ జానకమ్మ అనవసరంగా ఎప్పుడూ ఇలాగే పోట్లాట పెట్టుకుంటుంది.' అన్నాడు గోపాలరావు.

'ఆ పార్వతమ్మ మాత్రం, ఆవిడ కెందుకు ఈ అనవసరపు వకాల్తా? తనకేం సంబంధం? ఎవరెలా అనుకుంటే తన కెందుకు?'

'అదేమిటిలే, చూస్తూ, చూస్తూ అలా ఆడిపోస్తుంటే ఎవరూరుకో గలరు?'

'ఊరుకో లేకపోతే అక్కణ్ణించి లేచి పోలేదూ? కయ్యానికి కాలుదువ్వకపోతే!'

'తప్పు జానికమ్మదేగా!'

'ఏమో, ఎవరికి తెలుసు? పార్వతమ్మచెప్పిందే వేదంకాదుగా?'

'ఏమైనా జానికమ్మదే తప్పు.'

'పార్వతమ్మదే తప్పని నా నమ్మకం'

'ఎబ్బే ఆవిడదేం తప్పులేదు'

'జానికమ్మ ఉన్నమాట అంది. అందులో తప్పేముంది? కావాలని పార్వతమ్మే పోట్లాట పెట్టుకుంది.'

'నువ్వేమైనా అను. జానకమ్మదే నూటికి నూరుపాళ్లు తప్పు' అన్నాడు గోపాలరావు దృఢంగా.

'మీ రేమైనా అనండి. తప్పంతా పార్వతమ్మదేనని నేను ముమ్మాటికీ చెప్పగలను' అంది రాధ అంతకంటె దృఢంగా.

గోపాలరావు రాధవైపు కొంచెం కోపంగా చూసి అన్నాడు-

'నువ్వు మొదటినించీ ఇంతే. నేను ఔనంటే నువ్వు కాదంటం నీకు మామూలే'

'అలా ఎందుకనుకోవాలి. నేను కాదంటే మీరు ఔనంటం మీకు మామూలేనని ఎందుకనుకో కూడదు?'

'సంతోషించాంలే'

'మాట్లాడ లేక పోతే సరి'

'అంత మూఢత్వం పనికిరాదు'

'మూఢత్వం ఎవరిదో తెలుస్తూనే ఉంది.' రాధ బుంగ మూతితో గోడవైపు తల తిప్పింది. గోపాలరావు విసుగ్గా పేపరు చేతిలోకి తీసుకున్నాడు.

'ఈ రాధ ఎప్పుడూ ఇంతే. చెబితే అర్థం చేసుకోలేదు. ఈమనుష్యులు ఇంత సంకుచితంగా ఎలా ప్రవర్తిస్తారో! అని ఆశ్చర్య పడసాగాడు గోపాలరావు!